


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శనివారం 10-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 38 పేజీలు : 4 వెల : రూ 2-00

## ఆ నేతకు అగ్గిపుల్ల దొరకలేదా : సీతక్క

హైదరాబాద్: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కావాలా? వద్దా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. బస్సుల్లో మహిళలు ఉచితంగా తిరిగితే బిఆర్ఎస్ వాళ్లకు సమస్య ఏంటని? అడిగారు. మహిళలకు ఫ్రీ జర్నీని బిఆర్ ఎస్ తట్టుకోలేకపోతుందని విమర్శించారు. గవర్నర్ తమిళిసై ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి కామెంట్స్‌కు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. భావోద్వేగాలు రెచ్చగొట్టడం బిఆర్ఎస్ నేతల నైజం అని మండిపడ్డారు. గతంలో బిఆర్ఎస్ నేత పెట్రోల్ పోసుకున్నారు కానీ అగ్గిపుల్ల దొరకలేదా? అని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టడంతోనే అమాయకులు చనిపోయారని సీతక్క ధ్వజమెత్తారు.

# కృష్ణా జలాల్లో వాటాను వదులుకున్న కెసిఆర్



- ఎపికి అనుకూలంగా కెసిఆర్ నిర్ణయాలు
- కృష్ణాపరివాహక రైతులకు మరణశాసనం
- జగన్‌తో లాలూచీ రాజకీయాలు
- రాయలసీమను రతనాల సీమ చేస్తామని ప్రకటన
- ప్రజాస్వామ్యంలో రాచరికానికి తావ్వులేదు
- వాహనాల రిజిస్ట్రేషన్ పేరు టిజిగా మార్పు
- తెలంగాణ తల్లి విగ్రహంలోనూ మార్పులు
- గ్రూప్ పరీక్షలు నిర్వహించి తీరుతాం
- అసెంబ్లీ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి 9 : కృష్ణా జలాల్లో వాటాను వదులుకున్న ఘనత కెసిఆర్‌దని, ఎపికి అనుకూలంగా కెసిఆర్ నిర్ణయాలు తీసుకున్నారని, కృష్ణాపరివాహక రైతులకు మరణశాసనం రాశారని, ఇప్పుడేమో డ్రామాలు ఆడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. జగన్‌తో లాలూచీ రాజకీయాలు నడిపిందెవరని ప్రశ్నించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని ప్రకటన చేసింది నిజం కాదా అని అన్నారు. మన హక్కులను తాకట్టు పెట్టిన ఘనులు వారు కాదా అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షింగా కృష్ణాజలాపై చేసిన అన్యాయాలు మొదలు అందెశ్రీ, గూడ అంజయ్య, గద్దర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, అమరవీరులకు జరిగిన అవమానాలపై సిఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్‌ను ఏకి పారేశారు. ప్రజాస్వామ్యంలో రాచరికం ఉండకూడదని భావిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాద తీర్మానంపై మాట్లాడారు. కృష్ణా నదీ జలాలు, ఆ నదిపై ఉన్న ప్రాజెక్టులు క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందన్న వాదనను రేవంత్ రెడ్డి ఖండించారు. 2014 నుంచి 23 వరకూ కేఆర్ఎంబీ సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు కేసీఆర్ వెళ్లారని.. తాము ఇంత వరకూ ఏ సమావేశాలకు వెళ్లలేదని అన్నారు. ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటున్న మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీకి వెళ్లి ఆమరణ నిరాహార దీక్ష చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. అలా కాకుండా నల్లగొండలో ధర్నా చేస్తామనడం దారుణమని అన్నారు. అలాగే తాము చేస్తున్న పోరాటాలకు కలసి రావాలన్నారు. కృష్ణా నదీ జలాల విషయంలో చేసిందంతా చేసి ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెడుతున్నారని మండిపడ్డారు. జగన్‌కు దావత్ ఇచ్చి డైనింగ్ టేబుల్ మీద పునాదిరాయి వేశారని అన్నారు. రోజా ఇంట్లో విందు చేసి రాయలసీమ అభివృద్ధికి పాటుపడతానని సిఎం కెసిఆర్ అనలేదా అని అన్నారు. ఈ హామీతోనే ఎపి సిఎం జగన్ కృష్ణా ప్రాజెక్టుకు పొక్క పెట్టారని అన్నారు. దీంతో ఇప్పుడు తెలంగాణ ప్రయోజనాలను కెసిఆర్ పూర్తిగా పణంగా పెట్టారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ ఉద్యమ సమయంలో వాహనాలు, బోర్డులపై అందరూ టీజీ అని రాసుకున్నారు. కొందరు యువకులు తమ గుండెలపై టీజీ అని పచ్చబొట్టు వేయించు కున్నారు. కేంద్రం తమ నోటిఫికేషన్‌లో టీజీ అని పేర్కొంది. అందరి ఆకాంక్షలకు విరుద్ధంగా గత ప్రభుత్వం తమ పార్టీ పేరు గుర్తొచ్చేలా టీఎస్ అని పెట్టింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేం రాష్ట్ర అక్షరాలను టీజీగా మార్చాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో రాచరిక ఆనవాళ్లు ఉన్నాయి. తెలంగాణ తల్లి అంటే.. మనకు అమ్మ, అక్క, చెల్లి గుర్తు రావాలి. మన ఆడబిడ్డలు కిరీటాలు పెట్టుకుని ఉండలేదు. తెలంగాణ తల్లి అంటే గడీలో ఉండే మహిళ కాదు.. శ్రమజీవికి ప్రతీకగా ఉండాలి. అందెశ్రీ అనే కవి తెలంగాణకు గొప్ప గీతాన్ని అందించారు. జయజయహే గీతం తెలంగాణ ఉద్యమంలో అందరికీ స్ఫూర్తినిచ్చింది. రాష్ట్రం వచ్చాక జయజయహే రాష్ట్ర గీతం అవుతుందని అందరూ ఆశించారు. కానీ, ఆ పాటను నిషేధించినంత పని చేశారు. అందుకే అందెశ్రీ గీతాన్ని రాష్ట్రగీతంగా చేస్తున్నామని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే బాగుండని విపక్షం కోరుకుంటోంది. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదు. ప్రధాన విపక్షనేత సీటు ఖాళీగా ఉండటం సభకు శోభనీయం కాదు. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. పరిస్థితిని చక్కదిద్దుతూ ఈ ప్రభుత్వం ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చింది. మంచి పనులను అభినందించే సద్బుద్ధి విపక్ష నేతలకు లేదని సీఎం విమర్శించారు. కొట్లాడి తెచ్చుకన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు సూచనలు ఇచ్చి ఉంటే బాగుండేదని సీఎం అన్నారు. సభకు రాకపోవడం అసెంబ్లీ మర్యాదను అవమానించినట్లే అన్నారు. ప్రతి పక్ష నేతలు ఇప్పటికైనా సరైన పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నామన్నారు సీఎం రేవంత్

# కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింత

- బిఆర్ఎస్ ఆరోపణలు తిప్పికొట్టిన సిఎం
- హరీష్ వ్యాఖ్యలను తప్పుపట్టిన ఉత్తమ్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఆమోదం
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ సమర్పించనున్న భట్టి



హైదరాబాద్,ఫిబ్రవరి9(: శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి శాసనసభ ఆమోదం తెలిపింది. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమవుతుందని తెలిపారు. సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కేబినెట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. మండలిలో శ్రీధర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెడతారు. అంతకు ముందు శుక్రవారం సభలో కృష్ణాజలాలపై వాడీవేడీ చర్చ జరిగింది. కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింతపై విపక్ష బిఆర్ఎస్ చేసిన విమర్శలను సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా తిప్పికొట్టారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాజెక్టులను అప్పగించలేదని స్పష్టం చేశారు. హరీష్ రావు పాపాల భైరవుడని సిఎం ఈ సందర్భంగా ఘాటు విమర్శలు చేశారు. ఏ రంగం తీసుకున్న హరీష్‌రావు పాత్ర ఉందన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుల పై సీఎం రేవంత్ రెడ్డి ÷ర్ అయ్యారు. బీఆర్ఎస్ సహకారంతోనే ఏపీ సీఎం జగన్ తుపాకులతో వచ్చి నాగార్జున సాగర్‌ను ఆక్రమించుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ సహకారంతో నాగర్జున సాగర్ పైకి ఏకే 47 గన్స్ తో వచ్చారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి శ్రీశైలం నుంచి రోజుకు 12 టీఎంసీ నీళ్లు తోడుకపోవాలని చూస్తుంటే కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఇలా జరిగితే శ్రీశైలంలో బురద కూడా ఉండదని అన్నారు.నిండు కుండలా ఉన్న నీళ్లకు జగన్ మోహన్ రెడ్డి బొక్క పెట్టాలని చూస్తున్నా రని చెప్పారు. ఏపీ మంత్రి రోజా పెట్టిన రాగి సంకటి తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొట్లాడి ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును నల్లగొండ జిల్లాకు తెస్తే ఆ ప్రాజెక్టును గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. 2014 వరకు 30 కిలోమీటర్ల మేర తొవ్విన టన్నల్ ను పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒకటిన్నర కిలోమీటర్ తొవ్వారని అన్నారు. కల్వకుర్తి, కోయిల్ సాగర్ భీమాసాగర్ పూర్తి చేయలేదని చెప్పారు.

కృష్ణా నీటిలో 811 టీఎంసీల్లో 512 టీఎంసీలను ఏపీ వాడుకోవచ్చిన అధికారికంగా అప్పటి సీఎం కేసీఆర్ సంతకం పెట్టారని చెప్పారు. తెలంగాణ హక్కుల పై మరణ శాసనం రాశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాలపై మరణశాసనం రాసిందే బీఆర్ఎస్ పాలకులని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో 299 సరిపోతాయని సంతకం పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఇదే విషయాన్ని నామా నాగేశ్వర రావు చెప్పారు..నిజంగా ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నా చేయాలన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించిందే బీఆర్ఎస్ సర్కార్ అని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి బయటపడటంతో కెఆర్ఎంబికి అప్పగించా రంటూ తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తు న్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఏపీ మంత్రి రోజా ఇంట్లో రాయలసీమను రతనాల సీమ చేస్తామని బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు.. ఇప్పుడు రాయల సీమ జిల్లాలకు నీళ్ళు ఎట్లా పోతున్నాయో వారే సమాధానం చెప్పాలన్నారు.

# తేదీ మార్చకుండా రాజ్యాంగ పీఠికను సవరించవచ్చా?

## పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆమోదించిన నవంబర్ 26, 1949 అనే తేదీని తేదీని యథాతథంగా ఉంచుతూ రాజ్యాంగ పీఠికను సవరించవచ్చా అన్న సందేహాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని పీఠిక నుంచి సోషలిస్టు, సెక్యులర్ అన్న పదాలను తొలగించాలని కోరుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి, న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం పిటిషనర్లకు ఈ ప్రశ్నను సంధిస్తూ విషయ పరిజ్ఞానం కోసం తాము ఈ ప్రశ్న వేస్తున్నామని తెలిపింది. రాజ్యాంగ పీఠికలో దాన్ని ఆమోడించిన తేదీ ఉందని, ఆ తేదీని మార్చకుండా పీఠికను సవరించడం సాధ్యమేనా అని జస్టిస్ దత్తా ప్రశ్నిస్తూ అలా చేయవచ్చు అని తేలితే పీఠికను సవరించడంలో ఎటువంటి సమస్య లేదని అన్నారు. ఈ కేసులో అదే అసలైన ప్రశ్నని సుబ్రమణియన్ స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను చూసిన రాజ్యాంగ పీఠికలలో తేదీ పొందుపరిచిన రాజ్యాంగ పీఠిక ఇదొక్కటేనని జస్టిస్ దత్తా అన్నారు. ఫలానా రోజున ఈ రాజ్యాంగాన్ని అందచేస్తున్నామని మాత్రమే రాజ్యాంగ పీఠికలలో సాధారణంగా ఉంటుదని ఆయన చెప్పారు. అయితే సోషలిస్టు, సెక్యులర్ అన్న పదాలు రాజ్యాంగ పీఠిక మొదట్లో ఆమోదించినపుడు లేవని న్యాయవాది జైన్ తెలిపారు. ఒకనిర్దిష్టమైన తేదీతో భారత రాజ్యాంగ పీఠిక అమలులోకి వచ్చిందని, చర్చించకుండా పీఠికను సవరించడం సాధ్యం కాదని ఆయన తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ(1975-77) ఉన్న కాలంలో 42వ సవరణ చట్టం ఆమోదం పొందిందని ఈ సందర్భంగా స్వామి జోక్యం చేసుకుంటూ తెలిపారు. ఈ రోజు ఉదయమే కేసు ఫైళ్లు తమ వద్దకు వచ్చాయని, సమయాభావం కారణంగా వీటిని లోతుగా పరిశీలించలేదని సామికి జస్టిస్ ఖన్నా తెలిపారు. ఈ కేసును సవివరంగా చర్చించాల్సి ఉందని, అందుకోసం తదుపరి వాదనలను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ఇలా ఉండగా..బలరాం సింగ్ అనే వ్యక్తితోపాటు మరికొందరు వేసిన పిటిషన్‌కు స్వామి పిటిషన్‌ను 2022 సెప్టెంబర్ 2న ధర్మాసనం జతచేసింది. రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్టు, సెక్యులర్ అనే రెండు పదాలను తొలగించాలని స్వామి, బలరాం సింగ్ తమ పిటిషన్లలో కోరారు.

# కెసిఆర్ కుటుంబంలో లాగే మూడు పదవులు

- పార్టీ అనుమతిస్తే కొడుకు భద్రారెడ్డిని దింపుతా
- మల్కాజిగిరి నుంచి పోటీకి దింపే ఆలోచన
- రాజకీయాలు వదిలితే గోవా వెళ్లి ఎంజాయ్ చేస్తా
- మాజీమంత్రి మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్,ఫిబ్రవరి9 :కేసీఆర్ కుటుంబంలో మూడు పదవులు ఉన్నట్టు మా కుటుంబం నుంచి కూడా మూడు పదవులు ఉండాలని అనుకున్నట్లు మాజీమంత్రి మల్లారెడ్డి అన్నారు. పార్టీ అధినేత ఆదేశిస్తే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేసేందుకు మా కుమారుడు భద్రారెడ్డి సిద్ధంగా ఉన్నాడని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎంపీ టికెట్ కోసం సీఎం రేవంత్‌రెడ్డిని జగ్గారెడ్డి పొగుడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన ఫోకస్ కావడం కోసం నా పేరు ప్రస్తావిస్తున్నారు. మల్లారెడ్డి పేరు చెప్పకపోతే జగ్గారెడ్డిని ఎవరూ పట్టించుకోరు. గతంలో రేవంత్‌రెడ్డిపై ఆయన చేసిన విమర్శలు అందరికీ గుర్తున్నాయి. గోవాలో నాకు హోటల్ ఉంది. రాజకీయాల నుంచి తప్పుకొంటే అక్కడికే వెళ్లి ఎంజాయ్ చేస్తా. మనిషి జీవితం ఒకేసారి వస్తుంది.. ఎంజాయ్ చేయాలి'అని పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాలతో పాటూ సోషల్ మీడియాలోనూ సెంటరాఫ్ అట్రాక్షన్‌గా ఉండే మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తాజాగా ఇలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చిట్ చాట్‌లో భాగంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంలో మూడు పదవులు ఉన్నట్లు.. మా కుటుంబం నుంచి మూడు పదవులు ఉండాలని అనుకున్నామని చెప్పారు.

# దేశ ఆర్థికాభివృద్ధిలో పీవీది కీలకపాత్ర : ప్రధాని మోదీ



తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న వరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. పీవీకి భారతరత్న వరించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఓ రాజీతిజ్ఞుడిగా ఈ దేశానికి పీవీ నర్సింహారావు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా పీవీ అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు.'ఓ రాజనీతిజ్ఞుడిగా ఈ దేశానికి పీవీ నర్సింహారావు వివిధ హోదాల్లో విస్తృతమైన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా, అనేక సంవత్సరాల పాటు పార్లమెంటు, శాసనసభ సభ్యునిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో పీవీ దూరదృష్టి గల నాయకత్వం కీలకపాత్ర పోషించింది. ఈ దేశ శ్రేయస్సు, అభివృద్ధికి బలమైన పునాది వేసింది' అని అన్నారు. భారతదేశం ప్రపంచ మార్కెట్ దృష్టిలో పడింది పీవీ హయాంలోనే అని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. దేశం ఆర్థికా భివృద్ధి దిశగా కొత్త అడుగులు వేసింది కూడా ఆయన పాలనలోనే అని వివరించారు. విదేశాంగ నిపుణుడిగా, విద్యా రంగ కోవిదుడిగా పీవీ అందించిన సహకారం భారతదేశాన్ని సాంస్కృతికంగా, మేథో పరంగా సుసంపన్నం చేసిందని కీర్తించారు.

# తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలకు గుర్తింపు

- పివికి భారతరత్న రావడం గర్వకారణం
- స్వాగతించిన సిఎం రేవంత్, డిప్యూటి భట్టి



హైదరాబాద్,ఫిబ్రవరి9 : తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన మన తెలంగాణబిడ్డ, మాజీప్రధాని ఆర్థిక మేధావి, బహుభాషా కోవిదుదు పీవీ నర్సింహారావు కు భారతరత్న దక్కడం గర్వించదగిన విషయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ బిడ్డలుగా మనందరి గుండెల్లో ఆనందం ఉప్పొంగే క్షణమిది అని అన్నారు. పీవీతో పాటు మాజీ ప్రధాని చరణ్ సింగ్, ఎల్ కేఅద్వానీ, కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించడంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలు తెచ్చి ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. పీవీ నరసింహారావు కుటుంబానికి తెలంగాణ ప్రజల తరపున రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పీవీకి భారత రత్న దక్కడం పట్ల డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. కుప్పకూలబోతున్న భారత్ ఆర్థిక వ్యవస్థను తన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ ద్వారా ప్రపంచంలోనే ఆర్థికంగా బలమైన దేశంగా భారత్ ను రూపొందించడంలో స్వర్గీయ పీవీ నరసింహారావు తన చివరి శ్వాస వరకు శ్రమించారని కొనియాడారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరల పునాదుల ఫలితంగానే ఇవాళ భారత్ దేశం ప్రపంచంలోనే ఆర్థికంగా నాలుగవ బలమైన దేశంగా రూపుదిద్దుకుందన్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుదు తెలంగాణ రాష్టానికి చెందిన పీవీకి భారత రత్న దక్కడం .. కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ రాష్టానికి గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. మా పోరాటాన్ని సుదీర్ఘక కాలం తర్వాత గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు అని భట్టి అన్నారు.


# సంపాదకీయం

శనివారం 10-02-2024

## జాతీయ సమస్యగా వాయు కాలుష్యం

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మాత్రమే నీలి ఆకాశం కనబడుతోంది. గాలి నాణ్యత తీవ్రతకు ఇదొక సంకేతం. వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాల్లోని నలుసు పదార్థాల (పీఎం) సాంద్రత 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రో గ్రాములు మించకూడదు. ఇది ఢిల్లీ లాంటి నగరంలో 102. ఈ గాలిని పీల్చడం ప్రాణాంతకం. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి తెచ్చిన 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం' కొంతమేరకు ఫలితమిస్తున్నా అది సరిపోదు. మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో మనం వ్యవహ రిస్తున్నాం. ప్రజారోగ్య దృక్కోణం నుండి చూస్తే ఎంత ప్రగతి అయినా తక్కువే. నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే మెరుగైన ఫలితాలను ఇస్తుంది. శీతకాలపు నెలల్లో భారీ పొగమంచుతో కప్పబడి ఉండే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో నీలి ఆకాశం, ప్రకాశవంతమైన సూర్యబింబం అరుదుగా గోచరిస్తుంటాయి. అయితే పేలవమైన గాలి నాణ్యత అనేది ఇప్పుడు జాతీయ సమస్య అయింది. కాకపోతే గత ఐదేళ్లలో, వాయు కాలుష్యం ఒక విధానపరమైన సమస్యగా కూడా గుర్తింపు పొందింది. అయిన ప్పటికీ 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ' (ఎన్‌సీఏపీ) అయిదేళ్ల అంచనాను పరిశీలిస్తే, అర్థవంతమైన, శాశ్వతమైన ప్రయోజనాలను అందించడానికి గట్టి ప్రయత్నాలు అవసరమని తెలుస్తుంది.అపఖ్యాతి పాలైన భారతదేశ గాలి నాణ్యతను పరిష్కరించడానికి తెచ్చిన మొదటి విధానం ? 2019లో ప్రారంభించిన ఎన్‌సీఏపీ. కాలుష్య స్థాయులను, గాలిలోని నలుసు పదార్థాల గాఢతలను ప్రధాన నగరాల్లో 30 నుంచి 20 శాతం తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. దీనికి కేంద్రం నుండి రూ. 443 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 4,400 కోట్ల ప్రారంభ కేటాయింపులు జరిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి చెందిన నిరంతర పరిసర వాయు నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాల విశ్లేషణ (భారత దేశ వాయు నాణ్యతా మానిటర్ల నెట్‌వర్క్) పురోగతి స్థిరంగా ఉన్నప్ప టికీ, ఎన్‌సీఏపీని అమలు చేయడంలో వ్యూహాత్మకమైన, సైన్స్ ఆధారిత మార్పుల అవసరం ఉంది. ఉదాహరణకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గాల్లోని నలుసు పదార్థాల (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతకు పరిమితులు నిర్దేశించింది. 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు, 10 పీఎం అయితే ఒక క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించకూడదు.ఎన్‌సీఏపీ అమలయ్యాక, ప్రత్యేకించి 2.5 పీఎం వారణాసిలో 96 నుంచి 26.9 మైక్రోగ్రాములకు తగ్గింది. ఆగ్రాలో 73 నుంచి 33కు, జ్యోధ్‌పూర్‌లో 81.8 నుంచి 40.6కు మెరుగ్గా తగ్గింది. కానీ ఢిల్లీలో మాత్రం 108 నుంచి 102కు మాత్రమే తగ్గింది. పీఎం 2.5 స్థాయుల డేటా 2019?2023 మధ్య 46 నగరాలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం 27 నగరాల్లో మాత్రమే తగ్గుదల మెరుగ్గా ఉంది. 10 పీఎం విషయంలో ఐదేళ్ల డేటా కేవలం 46 నగరాలకు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 24 నగరాల్లో మాత్రమే మెరుగుదల కనబడింది.50 శాతం నగరాలు గణనీయమైన అభివృద్ధిని చూపుతున్నా యనీ, ఇది ఎన్‌సీఏపీ విజయవంతమైన ప్రగతిని సూచిస్తోందనీ ఎవరైనా వాదించవచ్చు. కానీ మనం మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో వ్యవహరిస్తున్నాము. పైగా రక్తపోటు, మధుమేహం వంటివాటిని ఇవి మరింత తీవ్రతరం చేయవచ్చు. 2.5 పీఎం రక్త?మెదడు అవరోధాన్ని కూడా దాటవచ్చు. దీర్ఘకాలం అలాంటి గాలిలో మసలితే ప్రాణాంతకం అవుతుంది. కాబట్టి, ప్రజారోగ్య దృక్పథం నుండి చూస్తే మరింత కఠినమైన ప్రగతి అత్యావశ్యం.మరో సమస్య ఏమిటంటే, ఎన్‌సీఏపీలో సమన్వయం కొరవడింది. ఢిల్లీ లాంటి నగరంలో సరి?బేసి ట్రాఫిక్‌ను అమలు చేయడం, 'జాతీయ రాజధాని ప్రాంతం' నుండి నిబంధనలు పాటించని వాహనాలను తొలగించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడాన్ని నిరోధించడం, దుమ్మును తగ్గించడానికి రోడ్లపై నీటిని చల్లడం వంటి చర్యలు అన్నీ అమలవుతున్నాయి. అయినప్పటికీ, కాలుష్యానికి సంబంధించిన ఇవే కారణాలు ఉన్న మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుంటే ఈ చర్యలు సరిపోవు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగమంచుతో చలి కాలం ప్రారంభం కావడం దీనికి స్పష్టమైన ఉదాహరణ.ఢిల్లీ నగరంలో నమోదైన సుమారు 80 లక్షల వాహనాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉష్ణోగ్రతలో తగ్గుదల గాలిలో నిలిచివుండే అణువుల స్థాయులను ప్రమాదకరంగా పెంచుతుంది. ప్రతి సంవత్సరం కొన్ని వారాల పాటు పీల్చుకుంటున్నారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) ప్రతి శీతాకాలంలో ఢిల్లీ?జాతీయ రాజధాని ప్రాంతంలో ఊహించిన ప్రతిస్పందనగా అమలులోకి వస్తుంటుంది. అయితే దాని ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి.రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సజావుగా సమన్వయం లేకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. జాతీయ రాజధాని వెలుపల, సీపీసీబీ పర్యవేక్షణ నెట్‌వర్క్ అసమానంగా ఉందని మా విశ్లేషణ చూపుతోంది. ఇది మూల్యాంకనానికి వ్యత్యాసాల పొరను జోడిస్తుంది. ముజఫర్‌పూర్, బిహార్ లాంటి రద్దీ ప్రదేశాలలో కేవలం మూడు మానిటర్లు ఉన్నాయి. అదే ఢిల్లీ అంతటా 37 స్టేషన్‌లు,ముంబై అంతటా 22, హైదరాబాద్‌లో 14 స్టేషన్లు ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉంది.ప్రామాణిక పర్యవేక్షణ విధానంలో, పోల్చదగిన జనాభా ఉన్న నగరాలు ఒకే విధమైన లేదా కనీసం సారూప్య సంఖ్యలో గాలి నాణ్యత మానిటర్లను కలిగి ఉంటాయి., ఇటుక బట్టీలు, నిర్మాణాలు, కూల్చివేత ప్రాజెక్టుల వంటి అత్యంత కాలుష్య కారకాలకూ... సిమెంట్, ఉక్కు కర్మాగారాలకూ భిన్నమైన విధానం అవసరం. అదేవిధంగా, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం మాత్రమే నిర్దిష్ట వయస్సు దాటిన పెట్రోల్, డీజిల్ వాహనాలను నిషేధించింది. కానీ దేశవ్యాప్తంగా కఠినమైన, కాలుష్య నియంత్రణ వ్యవస్థ లేక పోతే... ప్రమాణాలను అందుకోని వాహనాలను ఇతర నగరాలకు తరలించే ప్రమాదం ఉంది.

# మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 దేశంలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. గడిచిన కొన్నాళ్లుగా కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు తగ్గుముఖం పెట్టింది. రెండు నెలలు కిందట కొత్త వేరియంట్ ప్రపంచంలోని అనేక దేశాల్లో వ్యాప్తి చెందింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలను అలెర్ట్ చేసింది. విదేశాల నుంచి వచ్చే వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. కేంద్ర హెచ్చరికలతో అప్రమత్తమైన రాష్ట్రాలు భారీ ఎతత్తున పరీక్షలు నిర్వహించాయి. కొవిడ్ పాజిటివ్ వచ్చిన వారి నుంచి మరోసారి నమూనాలు సేకరించి కొత్త వేరియంట్ నిర్ధారణకు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లకు పంపించారు. కొత్త కేసులు నమోదు తగ్గుముఖం పట్టడం, కొత్త వేరియంట్ ప్రభావం దేశంలో పెద్దగా కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, మళ్లీ రెండు నెలలు తరువాత దేశంలో ఒక్కసారిగా కొవిడ్ కేసులు భారీగా పెరిగాయి. బుధవారం ఒక్కరోజే దేశ వ్యాప్తంగా 157 మందికి కరోనా వైరస్ సోకినట్టు కేంద్రం వెల్లడించింది. ఇవి భారీ కేసులు కానప్పటికీ ఈ మధ్యకాలంలో ఒక్కరోజు వ్యవధిలో నమోదైన అత్యధిక కేసులు కావడంతో కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఇప్పటికీ కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. నాలుగు రోజులకు మించి జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలు ఉండి, మందులు వాడుతున్నా తగ్గని వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా పరీక్షలు నిర్వహించిన వారికి అవసరమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాలు ఏర్పాట్లు చేశాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కొవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం లేని వారిని ఇళ్ల వద్దే హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి మానిటరింగ్ చేస్తున్నారు. ఏపీలోనూ ప్రతిరోజూ పదుల సంఖ్యలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆరోగ్యశాఖ అదికారులు చెబుతున్నారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతంలో మాదిరిగానే జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. కొత్త కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాల్లోని ప్రజలు సమూహాలకు దూరంగా ఉండడం, మాస్క్ ధరించడం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కాళేశ్వరం తర్వాత సెక్రటేరియెట్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 తెలంగాణ పరిపాలనా సౌధం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం నిర్మాణంలో అవినీతి జరిగిందని ప్రభుత్వం అనుమానిస్తోంది. ఆ భవనానికి అయిన ఖర్చు విషయంలో క్లారిటీ లేదు. ఈ భారీ నిర్మాణానికి అయిన ఖర్చెంత అంటే ఇతమిద్దంగా ఇంత అని చెప్పలేని పరిస్థితి ఇప్పుడు అధికారవర్గాల్లో కనిపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక భవనానికి చేసిన వ్యయం విషయంలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలను చాలా సార్లు కాంగ్రెన్ చేసింది. తాము అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తామనిచెప్పింది. ఇప్పుడు ఆ దిశగాచర్యలు తీసుకుంటున్నారు. సచివాలయం నిర్మాణం లో జరిగిన కొన్ని పనులకు అసలు టెండర్లే పిలవక పోవడంతో అవినీతి జరిగిందని విచారణ జరిపించడనికి రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఓ అవకాశం లభించినట్లయింది. ప్రధానంగా ఐటీకి సంబంధమైన పనుల విష యంలో వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుని అమలుచేశారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం సెక్యూరిటీతోపాటు అంతర్గతంగా అవసరమైన ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సంబంధమైన నెట్‌వర్కింగ్ పరికరాలు, సాఫ్ట్‌వేర్, ఇతరాలకు దాదాపు రూ. 300 కోట్లు ఖర్చు చేశారు. అంత భారీగా ఖర్చువడానికి అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎంత అత్యాధునికమైన నెట్ వర్క్ కోసం ఖర్చు పెట్టినా యాభై కోట్ల లోపే ఉంటుందంటున్నారు. సెక్రటేరియట్ భవనానికి తొలుత వ్యయం రూ.550 కోట్లుగా డీపీఆర్‌లో పేర్కొన్నారు. అందులో జీఎస్‌టీ మొత్తం కూడా ఉన్నట్టు అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారు. ఆ తర్వాత రూ. 611 కోట్లకు అంచనాలు పెంచారు. శంకుస్థాపన చేసిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు భవనానికి సంబంధించి పలు అంశాల్లో సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు పోయారు. సచవాలయ భవనం ప్లాన్ అనేక మార్పులు, చేర్పులు చేశారు. ఆస్కార్ అర్కిటెక్స్ కంపెనీ నచివాలయాన్ని డిజైన్ చేసింది.షాపూర్జీ–పల్లోంజీ సంస్థ నిర్మించింది. తొలుత 2022 , అక్టోబర్ దసరా పండుగ రోజున సచివాలయాన్ని ప్రారంభించాలని అనుకున్నారు. అయితే నిర్మాణం ఆలస్యం కావడంతో గత ఏడాది ఏప్రిల్ 30 ప్రారంభించారు. మే 30 నుంచి సచివాలయం అధికారికంగా విధుల్లోకి వచ్చింది. సచివాలయం చుట్టుతా నిర్మించిన దేవాలయం, మసీదు, చర్చీ ఖర్చు కూడా తొలుత డీపీఆర్‌లో చేర్చలేదు. కొత్తగా రోడ్లు సైతం చివరలో వేయాల్సి వచ్చిందనీ, దీంతో సచివాలయం భవన నిర్మాణం ఖర్చు తడిసిమోపెడైందని అంచనా వేస్తున్నారు. సెక్రటేరియట్ నిర్మాణంమొత్తం ఖర్చు రూ.1440 కోట్ల దాకా అయినట్టేనని అధికారులు అంటున్నారు. ఇదిలావుండగా సచివాలయంలో ఇప్పటికీ చేయాల్సి పనులు ఇంకా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మొత్తంత ఖర్చులో రూ.100 కోట్లు ఫర్నీచర్‌కే ఖర్చు చేయడం గమనార్హం. అలాగే జీఎస్టీ మొత్తం రూ. 100 నుంచి రూ. 150 కోట్లు ఉందని చెబుతున్నారు. కీలకమైన నెట్‌వర్కింగ్ ఖర్చు మాత్రం రూ.300 కోట్లు .. నిధులు ఎలాంటి టెండర్లు లేకుండా ఖర్చుపెట్టారని అంటున్నారు. సచివాలయం ప్రారంభానికి అప్పటి ప్రభుత్వం తొందరపడిందనీ, పనులు పూర్తికాకముందే చేసిందనే వ్యాఖ్యానాలు అప్పట్లోనే వచ్చాయి. టెండర్లు పిలిచే సమయం లేకపోవడంతో కంపెనీల నుంచి నేరుగా కంప్యూటర్లు, ఇతర పరికరాలు కొనాల్సి వచ్చిందని ఐటీ శాఖ ఉన్నతాధికారు కంగారు పడుతున్నారు. విచారణకు ఆదేశిస్తే.. కొంత మంది అధికారులు ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వైభవంగా మామిడిపల్లి లో జాతర

సిరిసిల్లల,మాఘ అమావాస్య సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత దేవాలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. స్వామివారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ దేవస్థానం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దత్తత తీసుకున్నప్పటినుండి ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, గ్రామ కమిటీ వారు సైతం అభివృద్ధిలో పాలుపంచు కుంటున్నారని, స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని లోకకళ్యాణార్థం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాల వల్ల రాష్ట్రంలో దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకున్నానని, రాబోయే రోజుల్లో ఆలయాన్ని మరింత తీర్చిదిద్దామన్నారు.

# ఏపీ విషయంలో బీజేపీ మైండ్ గేమ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు దేశంలోనే అత్యంత సంక్లిష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ రింగ్ మాస్టర్ గా మారింది. అన్ని పార్టీలు బీజేపీతో సన్నిహిత సంబంధాలను కోరుకుంటున్నాయి. ఎవరూ బీజేపీని వ్యతిరేకించడం లేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో బీజేపీతో కలిసి అధికారిక మిత్రపక్షంగా మారాలని టీడీపీ ప్రయత్నిస్తోంది. వైఎస్ఆర్‌సీపీ కూటమిలో చేరకపోయినా టీడీపీ కంటే నమ్మకమైన మిత్రపక్షంగా ఉంటామని సంకేతాలు పంపుతోంది. ఇలాంటి సమయంలో బీజేపీ హైకమాండ్ చంద్రబాబు, జగన్ లో రెండు రోజుల్లో వేర్వేరుగా సమావేశం కావడం సంచలనంగా మారింది.బీజేపీతో పొత్తులపై టీడీపీ ఇప్పటి వరకూ బహిరంగంగా ఒక్క మాట మాట్లాడలేదు. ఎన్డీఏలో చేరే అంశంపైనా స్పందించలేదు. గతంలో ఓ సారి అమిత్ షా, జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు. ఆ సమావేశం వివరాలు కూడా బయటకు రాలేదు. ఇప్పుడు ఎన్నికలకు ముందు మరోసారి ఢిల్లీ వెళ్లి వారిద్దరితో సమావేశం అయ్యారు. కానీ అంతర్గతంగా జరుగుతున్న చర్చల వివరాలు బయటకు రాలేదు. కేంద్రంలో వచ్చే సారి కూడా బీజేపీ గెలవడం ఖాయమని అంచనా వేస్తున్న సమయంలో బీజేపీ మద్దతు అవసరమని భావించి ఎన్డీఏ కూటమిలో చేరేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని చెబుతున్నారు. కానీ ఈ విషయంలో ఏ అడుగూ స్మూత్ గా పడటం లేదని .. టీడీపీ వైపు నుంచి పాజిటివ్ గా ఒక్క ప్రకటన కూడా రాకపోవడాన్ని అర్థం చేసుకోవచ్చు.మరో వైపు బీజేపీతో తెగదెంపులు అనే మాటను వినడానికి పవన్ కల్యాణ్ ఇష్టపడటం లేదు. కానీ ఆయన అధికారికంగా టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీజేపీ కూడా కూటమిలోకి రావాలని గట్టిగా కోరుతున్నారు. ఏపీలో ఓ సారి పొత్తులపై పార్టీ నేతల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన సమావేశం తర్వాత పొత్తులు కావాలంటే చంద్రబాబుతో చెప్పించాలని పవన్ కు.. బీజేపీ నేత సత్యకుమార్ సలహా ఇచ్చారు. ఆ తర్వాత అంతర్గతంగా జరిగిన పరిణామాలేమిటో తెలియదు కానీ చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు. పవన్ కూడా వెళ్లనున్నారు. అయితే చంద్రబాబుతో భేటీ ముగిసిన తర్వాత.. ఎం జరిగిందో బయటకు రాక ముందే ఏపీ సీఎం జగన్ కు ఆహ్వానం పలికారు అమిత్ షా, ప్రధానమంత్రి మోదీ. అమిత్ షా , జేపీ నడ్డాలతో చంద్రబాబు భేటీ ముగిసిన తర్వాతి రోజే సీఎం జగన్ కు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అపాయింట్ మెంట్ ఖరారైందని ఆయనకు సమాచారం వచ్చింది. దీంతో గురువారం సాయంత్రం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ప్రధానితో భేటీ అని ప్రచారం జరిగినప్పటికీ అమిత్ షాను కూడా కలిశారు. అక్కడే అసలు రాజకీయం ఉందన్న అభిప్రాయం ఏపీ రాజకీయాల్లో వినిపిస్తోంది. భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని.. చంద్రబాబుతో భేటీ విషయంలో అంత సంతృప్తికరంగా లేకపోవడంతోనే ఉన్న పళంగా జగన్ కు అపాయింట్ మెంట్లు ఖరారు చేశారని అంటున్నారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ తో ఖచ్చితంగా రాజకీయాలే చర్చించి ఉంటారని.. అంచనా వేస్తున్నారు. ఏపీలో ఇరవై ఐదు లోక్ సభ సీట్లు ఉన్నాయి. ఏ పార్టీ గెలిచినా ఆ సీట్లన్నీ బీజేపీకే మద్దతుగా ఉంటాయి. సీఎం జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా నేరుగా చెప్పకపోయినా అదే విధంగా మద్దతు ఇచ్చారు. బేషరతతు మద్దతు ఇచ్చి బీజేపీ హైకమాండ్ పెద్దల అబిమానాన్ని చూరగొన్నారు. ఈ విషయంలో జగన్ పై వ్యతిరేకత పెంచుకోవాల్?న అవసరం బీజేపీ హైకమాండ్ కు లేదు. ఇప్పటికిప్పుడు టీడీపీతో జత కట్టడం ద్వారా వైసీపీకి వ్యతిరేకవ్వాల్సిన అవసరం ఏముందన్న ఆలోచన కూడా బీజేపీ హైకమాండ్ కు ఉండొచ్చని చెబుతున్నారు. ఏదో ఓ పార్టీతో పొత్తులో వెళ్లడం వల్ల మరో పార్టీ వ్యతిరేకం అవుతుంది. అలాంటి పరిస్థితిని ఎందుకు కల్పించుకోవాలని బీజేపీ ఆలోచిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఏపీలో బలపడటం బీజేపీ టార్గెట్. దాని కోసం ఎలాంటి చిన్న అవకాశాన్ని వదిలే అవకాశం లేదు. పొత్తుల్లో భాగంగా అత్యధిక ఎంపీ సీట్లు, ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తే టీడీపీని ఎన్డీఏలోకి ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఆ పార్టీ ముఖ్య నేతలందరికీ ఎంపీ టిక్కెట్లు లభిస్తే.. మొగ్గు ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఏపీలో బీజేపీ హైకమాండ్ ఎవరూ ఊహించని పొలిటికల్ గేమ్ ఆడుతోందన్న అభిప్రాయం మాత్రం వినిపిస్తోంది.

## ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి నోట్ బుక్,పెన్నుల పంపిణీ.



ఖానాపూర్ రూరల్,ఫిబ్రవరి09( లోకం తీరు): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో పిఆర్టీయూ తెలంగాణ సంఘం అవిర్భావ దినోత్సవం,పిఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు దివంగత సామల యాదగిరి జయంతి దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పిఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాల్గోట్ కిషన్ పాత ఎల్లాపూర్ గ్రామ ప్రాథమిక,ఉన్నత పాఠశాలలోని 150మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు,పెన్నులను పంపిణీ చేశారు.అనంతరం పిఆర్టీయూ రాష్ట్ర సహచర అధ్యక్షులు,ఉన్నత పాఠశాల పీజి హెచ్ఎం రమాదేవి పాఠశాలల విద్యార్థులకు అరటిపండ్లను అందజేశారు.ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మారుతి స్వామి,ఉపాధ్యాయులు మల్లయ్య,విజయ్,తిరుమల,సుమలత,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ చిలుకల చిన్నమ్మ దేవస్థానానికి సందర్శించిన ఎస్సై కి గోపి




బాల్కొండ నియోజకవర్గ ప్రతినిధి , ఫిబ్రవరి 9 ( లోకం తీరు): నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం శ్రీరాంపూర్ లో చిలుకల చిన్నమ్మ దేవస్థానం లో జాతర సందర్భంగా బాల్కొండ ఎస్సై కే గోపి సందర్శించారు. శ్రీరాంపూర్ లో జరగబోయే ఉత్సవాలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై కే గోపి, ఏఎస్సై శంకర్, కానిస్టేబుల్ రాజేశ్వర్ బాల్కొండ పోలీసులు పాల్గొన్నారు.

## వాహనాల దొంగల అరెస్ట్- జిల్లా ఎస్పీ సింధు శర్మ



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు ఫిబ్రవరి 9)కామారెడ్డి చుట్టుపక్కల ఏరియాలలో వరుస మోటార్ సైకిల్ దొంగతానలు జరుగుతున్నందున, కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూ శర్మ, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, సూచనలతో, డి.ఎస్.పి ప్రకాష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సిసిఎస్ సిఐ, యన్.ఐ మరియు సిబ్బందిబృందాలుగా ఏర్పడి నేరస్తులను పట్టుకోవడానికి, ప్రయత్నాలు చేస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు ఈనెల 08 న కామారెడ్డి పట్టణంలో నిజాంసాగర్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదముగా బండిపై వచ్చిన ముగ్గురు నేరస్తులను పోలీసులు ఆపి వాహన సంబందిత కాగితాను చూపించమనగా, అట్టి నేరస్తులు పోలీసు వారి నుండి తప్పించుకొనే ప్రయత్నము చేయగా, వెంటనే పోలీసు వారు పట్టుకొని విచారించగా, తాము మొత్తం (29) బైక్ లను కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో పలుచోట్ల దొంగతనాలు చేసినట్లుగా నేరాలను ఒప్పుకున్నారు. నిజాంపూర్ శంకర్ ( 19), యారు గట్ల సందీప్(26), షేక్ అహ్మద్(28) గా గుర్తించారు. వీరుపై ఉమ్మడి జిల్లాలలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయాన్ని తెలిపారు.వీరు నేరాల ను ఒప్పుకున్నందున కేసు నమోదు చేయడం జరిగిందని ఇట్టి మొత్తం 29 మోటార్ సైకిల్స్ విలువ సుమారు రూ. 40,00,000/- వరకు ఉంటుంది. వీటిలో 12 బుల్లెట్ బండ్లు, 12 పల్సర్ బండ్లు, 1 ఆక్టివ బండి, 1 గ్లామర్ బండి, డీలక్స్ బండి, 1 స్ప్లెండర్ బండి, 1 టివిఎస్ స్టార్ సిటి బండి కలవు. ఇకపై ఎవరైనా కామారెడ్డి జిల్లాలో నేరం చేయడానికి ప్రయత్నిస్తే గాని లేదా నేరం చేస్తే గాని వారిని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సీసీ టీవీ ఫుటేజ్, ఇన్ఫార్మర్ ల ద్వారా సమాచారం సేకరించి ఖచ్చితంగా నేరస్తులను వెంబడించి పట్టుకుంటామని, అదేవిధంగా నేరస్థులను కోర్టు ముందు ప్రవేశ పెట్టి కచ్చితంగా వాళ్లకు శిక్షలు పడే విధంగా చేస్తామని అన్నారు.ఈ కేసులను అతి తక్కువ సమయములో చాకచక్యముగా వ్యవహరించి ఛేదించిన కామారెడ్డి పట్టణ సిఐ చంద్ర శేఖర్ రెడ్డి ని, సిసిఎస్ సి ఐ మల్లేశ్ గౌడ్, శ్రీనివాస్, ఎస్ ఐ లు ఉస్మాన్, శ్రీరామ్, సిబ్బంది రాజేశ్వర్, సురేందర్, సయీద్, కిషన్, గణపతి, శ్రవణ్, రాజేందర్, కర్ణాకర్, రాజు, విశ్వనాథ్, రమేశ్, నరేశ్, భాస్కర్, రవి, నవీన్ లను జిల్లా ఎస్పి అభినందించారు.

# నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పోచారం జన్మదిన వేడుకలు



.బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-మాజీ మంత్రి, మాజీ స్పీకర్,బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు నేడు అనగా శనివారం రోజున కోటగిరి,పోతంగల్ మండల కేంద్రాలలోని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయాలలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కోటగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోతంగల్లో ఉదయం 10-00 గం.లకు అలాగే కోటగిరిలో ఉదయం 11-00గం.లకు జరిగే ఈ జన్మదిన వేడుకల్లో కేక్ కటింగ్,పలు సేవా కార్యక్ర మాలు ఉంటాయని ఆయన చెప్పారు.బీఅర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకు లు,ముఖ్య నేతలు,కార్యకర్తలు, పోచారం అభిమానులు వేడుక ల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పురుగుల మందు తాగి మహిళా మృతి.

బాన్సువాడ కోటగిరి లోకం తీరు:-గుర్తు తెలియని పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మహిళా మృతి చెందిన ఘటన కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుం ది.ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పోతంగల్ మండలంలోని చేతనగర్ గ్రామానికి చెందిన కాంబ్లే ఆమ్రపాలి ఫిబ్రవరి 8న గుర్తుతెలియని పురుగుల మందు సేవించారని .ఫిబ్రవరి 9ననిజామాబాద్లోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మరణించిందని.మృతురాలితల్లికాశేవార్ దైవశీల దరఖా స్తు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నామని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు

## రోడ్డు విస్తరణ పనులను సమన్వయంతో పూర్తి చేయాలి..

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు..





నిజామాబాద్, ఫిబ్రవరి 09(లోకంతీరు) : ఎల్లారెడ్డి - రుద్రూర్ సెక్షన్ లో రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సకాలంలో పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్ లో శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఎన్.హెచ్ 765డి పరిధిలోని ఎల్లారెడ్డి-రుద్రూర్ సెక్షన్ లో రోడ్డు వెడల్పు పనులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండు లేన్ల రోడ్డు విస్తరణ పనుల కోసం వర్ని వద్ద 9.4638 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించాల్సి ఉందన్నారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనుల కోసం భూమిని సేకరించడంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఎకో-టూరిజం ఈ.డీ రంజిత్ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ వేణు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన పోతంగల్ మండల పిఆర్టియు అధ్యక్షులు.

బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-పిఆర్టియు ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నిజామాబాద్లోని పిఆర్టియు భవన్లో పిఆర్టియు పోతంగల్ మండల అధ్యక్షులు సూదం వెంకటేష్ రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ యాది రెడ్డి,పిఆర్టియు జిల్లా అధ్యక్షు లు మోహన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర గౌడ్, రచ్చ మురళి,అంబెల్లి శంకర్, జిల్లాలోని ఆయా మండలాల పిఆర్టియు అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు,ఉపాధ్యాయ పాల్గొ న్నారు.



# మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా 'ఎర్రజొన్న'కు పూర్తి స్థాయి ధర

### సీడ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ క్వింటాకు రూ. 3500 లకు తగ్గకుండా ధర చెల్లిస్తామని ట్రేడర్ల హామీ





నిజామాబాద్, ఫిబ్రవరి 09 : ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ పంటను సేకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఎర్రజొన్న దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో, శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి తో కలిసి కలెక్టర్ వ్యవసాయ అధికారులు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోళ్లు జరగాలని, ఒకవేళ రైతులు బయట మార్కెట్లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్ లో ఎర్రజొన్న సాగు చేసిన విస్తీర్ణం, పంట దిగుబడులు, రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విఫణిలో ఎర్రజొన్న పంటకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతుల నుండి సేకరించిన ఎర్రజొన్న పంటను ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని, అక్కడ ఎర్రజొన్నను పశువులకు దాణాగా వినియోగిస్తారని సీడ్ కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈసారి పంటకు మార్కెట్లో ఆశించిన రీతిలోనే ధర పలుకుతోందని తెలిపారు. పంట వెరైటీలను బట్టి క్వింటాకు రూ. 3500 నుండి 4300 వరకు ధర లభిస్తుండగా, తాము కూడా రైతులతో అదేరీతిలో బైబ్యాక్ ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడిప్పుడే పంట కోతలు ప్రారంభం అయ్యాయని, మరో పక్షం రోజుల తరువాత పెద్ద ఎత్తున దిగుబడులు చేతికందుతాయని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా గతేడాది తరహాలోనే ఈసారి కూడా రైతుల నుండి మద్దతు ధరకే ఎర్ర జొన్న పంటను సేకరిస్తామని, సీజన్ చివరి దశ వరకు కూడా క్వింటాకు కనీస మద్దతు ధరగా రూ. 3500 వరకు చెల్లిస్తామని ట్రేడర్లు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఏ.ఓలు, ఏ.ఈ.ఓలను అప్రమత్తం చేసి ఎర్రజొన్న క్రయవిక్రయాలను నిశితంగా పరిశీలన జరిపించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎక్కడ కూడా వ్యాపారులు కూడబలుక్కుని ధర తగ్గించారనే ఫిర్యాదులు రాకూడదని, మార్కెట్ డిమాండ్ ను అనుసరిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో ట్రేడర్లు ధర చెల్లింస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలని అధికారులకు హితవు పలికారు. ఎవరైనా వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి రైతులను మోసగించే చర్యలకు పాల్పడితే జిల్లా యంత్రాంగం ఉపేక్షించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏ.డీ.ఏలు, ఏ.ఓలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన

### సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్...
### కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
### ఎల్ డిఎం యు.నాగ శ్రీనివాసరావ్..





నిజామాబాద్, ఫిబ్రవరి 09(లోకంతీరు) :కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఐ అండ్ బి, సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మ నాయక్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలూరు, ఖానాపూర్ లో వికసిత్ భారత్ యాత్ర పేజ్ 2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ అండ్ బి, సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియని వారికి, వాటిని వినియోగించుకోకుండా ఇంకా మిగిలిపోయిన వారికి పథకాలు అందించడానికి పెద్ద ఎత్తున వికసిత్ భారత సంకల్ప యాత్రను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పీఎం జీవన్ బీమా పథకం, రీ సర్వే కార్యక్రమాల్లో ఆధునిక టెక్నాలజీ, ఐటీ పరంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్, పిఎంజెఏవై, ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్, ఉజ్వల, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, దీనదయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, ఆవాస్ యోజన, విశ్వకర్మ, పిఎం పోషణ్ అభియాన్, హర్ ఘర్ జల్ - జల్ జీవన్ మిషన్, జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. వికసిత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆధార్ ఎన్రోల్మెంట్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల న్నారు. అలాగే ఎల్ డిఎం యు.నాగ శ్రీనివాసరావ్మా ట్లాడుతూ....అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా మీ ముంగిటకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ మాలిక్, డాక్టర్, అగ్రికల్చర్, మెప్మా, ఇతర శాఖల అధికారులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం దరఖాస్తులు విచారణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా





భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి9( లోకం తీరు):మహాలక్ష్మి పథకం దరఖాస్తులు విచారణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో దరఖాస్తులు విచారణ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందేచేసిన దరఖాస్తుల్లో గ్యాస్ నంబర్ నమోదులో తప్పిదాలను సవరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే బృందాలను నియమించడం జరిగిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ అందించనున్న నేపథ్యంలో ప్రజాపాలన దరఖాస్తుల విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. దరఖాస్తులు విచారణ, ఆన్లైన్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ నెల 10 వరకు విచారణ ప్రక్రియ పూర్తి చేయుటకు ప్రతి గ్రామ పంచాయతీకి 4 టీములు, అలాగే మున్సిపల్ వార్డుకు ఇద్దరిని నియమించి ఆన్లైన్ చేసేందుకు లాగిన్స్ ఇచ్చినట్లు చెప్పారు. విచారణకు వచ్చే టీములకు ప్రజలు గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగ దారుని నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూర్చలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచేసేందుకు ప్రత్యేక యాప్ ను రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్లోలబ్ధిదారుల వివరాలను సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీఓలు, తహశీల్దార్ లు, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి అర్జున్,మున్సిపల్ కమిషనర్ రఘు, కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, ఈడీఎం విజయసారథి, కౌన్సిలర్ జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ఆప్షనల్ హాలిడే గా ప్రకటించాలి -సీఎంకు వినతిపత్రం.. నల్గొండ ఎమ్మెల్యేలు

మిర్యాలగూడ,ఫిబ్రవరి 09( లోకం తీరు):బంజారా సోదరుల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15 వ తేదీని ఆప్షనల్ డే గా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే భద్ర లక్ష్మారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే , నల్గొండ జిల్లా డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ మరియు గిరిజన నాయకులు శుక్రవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి కోరడంతో వారు సానుకూలంగా స్పందించి త్వరలో ప్రకటిస్తామని తెలియజేయడంతో గిరిజన నాయకులు నల్లగొండ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# సీనియర్ జర్నలిస్టుకు ఘన నివాళులు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు.



బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-సీనియర్ జర్నలిస్ట్ హంగర్గ గంగాధర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కోటగిరి మండల ప్రెస్ క్లబ్ పాత్రికేయులు ఆయన స్వగృహంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ముందుగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రెస్ క్లబ్ పాత్రికే యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంత రం గంగాధర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా హంగర్గ గంగాధర్ కుటుంబ సభ్యులకు జర్నలిస్టు లు మనోధైర్యని కల్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గోగినేని హనుమంతరావు మాట్లాడుతూ.కోటగిరి మండలంలో జర్నలిజానికి మరో పేరుగాంచిన క్రీస్తు శేషులు హంగర్గ గంగాధరని అన్నారు. ఆయన ఎక్కడున్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుని వేడు కుంటున్నామన్నారు. సమాజంలో పాత్రికేయులు ఎలా ఉండాలి,ఏ విధంగా నడుచుకోవాలని,సమాజ సంక్షేమంలో ఎలా పాటుపడాలి అని తెలియజేసిన ప్రథముడు హంగర్గ గంగాధరని అని కొనియాడారు.మేమంతా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సమాజానికి ఇతోధికంగా కృషి చేస్తామన్నారు.వారి కుటుంబ సభ్యులకు సైతం మా ప్రెస్ క్లబ్ అండదండలు ఉంటామని ఆయన్నారు.ఈ కార్యక్రమంలో పోరు న్యూస్ రిపోర్టర్ బి రాములు,దిశ రిపోర్టర్ కాసుల శ్రీకాంత్,ఆంధ్రప్రభ రిపోర్టర్ పెంటయ్య,భారతి ఛానల్ రిపోర్టర్ సాయిబాబా గౌడ్,మన న్యూస్ రిపోర్టర్ పుప్పాల సైదయ్య,తెలుగు ప్రభ రిపోర్టర్ సాయిలు,మీడియా టుడే రిపోర్టర్ ఎన్నవార్ రాజు,జనశక్తి రిపోర్టర్ జి.రాజు,చట్టం రిపోర్టర్ ఇందుర్ గంగాధర్,ఆజ్ కా తెలంగాణ రిపోర్టర్ హైమద్,సిటీ డిజిటల్ లోకల్ న్యూస్ రిపోర్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

# సినిమా తీరు

## మూవీ రివ్యూ : ఈగల్




నటీనటులు: రవితేజ – కావ్య థాపర్ – అనుపమ పరమేశ్వరన్ – వినయ్ రాయ్ – నవదీప్– శ్రీనివాస్ అవసరాల– మధుబాల –నవదీప్ – శ్రీనివాసరెడ్డి – అజయ్ ఘోష్ తదితరులు సంగీతం: దేవ్ జాండ్ ఛాయాగ్రహణం: కార్తీక్ ఘట్టమనేని – కర్మ్ చావ్లా – కామిల్ ప్లాకి కథ: కార్తీక్ ఘట్టమనేని మాటలు: మణిబాబు కరణం స్క్రీన్ ప్లే: కార్తీక్ ఘట్టమనేని – మణిబాబు కరణం నిర్మాత: టి. జి. విశ్వప్రసాద్ దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని గత ఏడాది రావణాసుర.. టైగర్ నాగేశ్వరరావు చిత్రాలతో దెబ్బ తిన్నాడు మాస్ రాజా రవితేజ. ఆయనకు ఈగల్ ఎంతో ముఖ్యమైన సినిమా. కెమెరామన్ టర్న్డ్ డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని రూపొందించిన ఈ చిత్రం ఈ రోజే మంచి అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈగల్ ఆ అంచనాలను ఏ మేర అందుకుందో చూద్దాం పదండి. కథ: సహదేవ్ (రవితేజ) చిత్తూరు జిల్లాలోని తలకోన ప్రాంతంలో ఒక గిరిజన ప్రాంతంలో ఫాం హౌస్ కట్టుకుని ఒక పత్తి ఫ్యాక్టరీని నడుపుతుంటాడు. అక్కడ పండే అరుదైన పత్తిని రైతులు తీసుకొచ్చి ఇదే ఫ్యాక్టరీలో నేయడం ద్వారా జీవనం సాగిస్తుంటారు. ఐతే ఈ ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతంలోనే బాక్సైట్ గనులు ఉన్నాయని తెలిసి ఆ ప్రాంత ఎమ్మెల్యేతో పాటు ఒక వ్యాపారవేత్త కన్ను దానిపై పడుతుంది. ఎలాగైనా సహదేవ్ ను.. అక్కడి రైతులను అక్కడి నుంచి ఖాళీ చేయించి ఆ ప్రాంతాన్ని చెరబట్టాలని చూస్తారు. కానీ పైగా మామూలు వ్యక్తిలా కనిపించే సహదేవ్ వెనుక వేరే కథ ఉంటుంది. అతడికి 'ఈగల్' అనే మరో రూపం కూడా ఉంటుంది. ఆ కథేంటి.. ఆ రూపమేంటి.. తనను అంతం చేయాలని వచ్చిన వాళ్లను సహదేవ్ ఎలా ఎదుర్కొన్నాడు.. ఈ విషయాలన్నీ తెర మీదే చూసి తెలుసుకోవాలి. కథనం– విశ్లేషణ: హీరో గురించి వేర్వేరు పాత్రలతో గొప్పగా చెప్పించడం.. అతను చేసిన విధ్వంసం గురించి ఆయా పాత్రలు గగుర్పాటుకు గురవుతూ మాట్లాడడం.. ఈ క్రమంలో ఎలివేషన్ పండించే ప్రయత్నం చేయడం ఎప్పట్నుంచో ఉన్న స్టైలే. కాకపోతే ఈ మధ్య కేజీఎఫ్ అనే సినిమా ఒకటి వచ్చి ఈ స్టైల్ ను వేరే లెవెల్ కు తీసుకెళ్లింది. దీంతో అందరూ ఈ ట్రెండును అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఆ తరహా ఎలివేషన్ అన్నిసార్లూ వర్కవుట్ కావట్లేదు. ఇతర పాత్రలు హీరో గురించి మాట్లాడగానే ఇచ్చే ఓవర్ రియాక్షన్లు.. వాళ్ల బిల్డప్పులకు తగ్గట్లు సన్నివేశాలు ఉంటేనే ఎలివేషన్ పండుతుంది. అలా కానపుడు బ్యాలెన్స్ దెబ్బ తింటుంది. ప్రేక్షకులు ముందు ఊహించుకున్నదానికి.. తర్వాత చూసిందనానికి పొంతన కుదరక సన్నివేశాలు తేలిపోతుంటాయి. ఈ కోవలో చెప్పుకోవడానికి చాలా సినిమాలున్నాయి. 'ఈగల్'తో ఉన్న సమస్య కూడా దాదాపు ఇలాంటిదే. సినిమా మొదలు కావడం ఆలస్యం.. విధ్వంసం.. ఉత్పాతం.. విస్ఫోటనం అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడేస్తుంటాయి పాత్రలు. హీరోకు ఒక్కొక్కరు ఇచ్చే బిల్డప్ మామూలుగా ఉండదు. ఇక హీరో కథను చెప్పే క్రమంలో గతం–గరుడపురాణం.. మృగసిర–మధ్యరాత్రి.. పట్టపగలు–పద్ధతైన దాడి.. కంచె–కాపరి.. అంటూ ఘనమైన పదబంధాలు వాడి తెర మీద అద్భుతం ఏదో చూపించబోతున్న భ్రమలు కల్పిస్తారు. తీరా చూస్తే.. మామూలు సన్నివేశాలే దర్శనమిస్తాయి. ఓపెన్ మైండ్ తో చూస్తే 'ఈగల్' డీసెంట్ గానే అనిపించవచ్చు. కానీ కథను నరేట్ చేయడంలో అవసరం లేని ఆర్భాటమే ఈ చిత్రానికి సమస్యగా మారింది. ఇంతకుముందు ఓ సరికొత్త ఐడియాతో 'సూర్య వెర్సస్ సూర్య' అనే వెరైటీ సినిమా తీశాడు కార్తీక్ ఘట్టమనేని. కానీ అతడి ఐడియా బాగున్నప్పటికీ.. దాన్ని ఒక కథగా పకడ్బందీగా చెప్పడంలో.. మంచి ముగింపునివ్వడంలో తడబడ్డాడు. ఈసారి తను ఎంచుకున్న కథ మరీ కొత్తగా అనిపించకపోయినా.. స్క్రీన్ ప్లేతో మ్యాజిక్ చేయాలని ప్రయత్నించాడు. హీరో నేర ప్రవృత్తి ఉన్న వ్యక్తి.. ఓ అమ్మాయి ప్రేమలో పడతాడు.. తన నేపథ్యమేంటో చెప్పడు.. కానీ తన బ్యాగ్రౌండ్ వల్ల ఆమె ప్రాణం పోతే.. అలాంటి నష్టం ఇంకెవరికీ జరగకుండా ప్రక్షాళనకు నడుం బిగిస్తాడు. ఈ లైన్లో చాలా సినిమాలే చూశాం. ఐతే అదే ఫార్మాట్లో కాస్త భిన్నమైన నేపథ్యాన్ని జోడించి 'ఈగల్'కు కొత్త కలర్ తీసుకొచ్చాడు కార్తీక్. ఒక రెగ్యులర్ కమర్షియల్ సినిమా చూస్తున్న ఫీలింగ్ అయితే కలిగించదు 'ఈగల్'. హీరో పాత్రను నిగూఢంగా ఉంచుతూ.. దాని పట్ల క్యూరియాసిటీ పెంచడంలో దర్శకుడు విజయవంతం అయ్యాడు. ఐతే ముందే అన్నట్లు హీరో పాత్రకు ఒక్కొక్కరు ఇచ్చే బిల్డప్పే శ్రుతి మించిపోయింది. ఎంతకీ అసలు విషయంలోకి వెళ్లకుండా కనిపించిన ప్రతి ఒక్కరూ అతనో ఉత్పాతం.. అతను చేసింది మామూలు విధ్వంసం కాదు అంటూ బిల్డప్పులివ్వడానికే చాలా సమయం పట్టేసింది. తీరా హీరో రంగంలోకి దిగాక అతను మామూలుగానే కనిపిస్తాడు. తన పాత్ర యాక్టివేట్ కావడానికి చాలా సమయం పడుతుంది. కొండ మీద ఫామ్ హౌస్ కట్టుకుని కాటన్ ఫ్యాక్టరీని నడిపే హీరో వ్యవహారం ఏమంత ఆసక్తికరంగా అనిపించదు. మరోవైపు 'ఈగల్' అంటూ హీరో పాత్రలోని మరో కోణం చుట్టూ 'రా' వాళ్లు చేసే ఆపరేషన్లోనూ ఆసక్తి అంతంతమాత్రమే. హీరోలోని విధ్వంస కోణాన్ని బయటపెట్టే యాక్షన్ ఎపిసోడ్ వచ్చేవరకు 'ఈగల్' పెద్దగా ముందుకు కదలదు. ప్రథమార్ధం చాలా వరకు బోరింగ్ గానే అనిపిస్తుంది. సెకండాఫ్ లో యాక్షన్ మోతాదు పెరగడంతో 'ఈగల్' ఊపందుకుంటుంది. సినిమాలో మొదట్నుంచి చెబుతున్న 'విస్ఫోటనం' ఎపిసోడ్ పీక్స్ కు వెళ్లాక ప్రేక్షకులు కోరుకున్న హై వస్తుంది. ఈ యాక్షన్ ఘట్టాన్ని చాలా స్టైలిష్ గా.. భారీగా.. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా తీర్చిదిద్దాడు కార్తీక్ ఘట్టమనేని. ఇక యూరప్ నేపథ్యంలో సాగే హీరో ఫ్లాష్ బ్యాక్ సోసోగా అనిపిస్తుంది.

## మీకు 'హై బిపి' సమస్య ఉందా? ఈ రసం బిపి నార్మల్ గా ఉండటానికి త్రాగాలి ...



నేడు అధిక రక్తపోటు అత్యంత సాధారణ జీవనశైలి వ్యాధులలో ఒకటిగా మారింది. అధిక రక్తపోటు సాధారణంగా వృద్ధులను ప్రభావితం చేస్తుంది. కానీ ఇప్పుడు యువతలో కూడా సమస్య పెరిగింది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం లేనప్పటికీ, అధిక రక్తపోటు సమస్యను ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు ఆహారపు అలవాట్ల ద్వారా నిర్వహించవచ్చు.ధమనుల గోడలకు వ్యతిరేకంగా రక్తం యొక్క శక్తి చాలా ఎక్కువగా ఉన్నప్పుడు రక్తపోటు. ఫలితంగా రక్తప్రవాహంలో ప్రతిష్టంభన ఏర్పడి రక్త నాళాలపై ఎక్కువ ఒత్తిడి తెస్తుంది. ఎక్కువ కాలం చికిత్స చేయకపోతే, ఈ పరిస్థితి స్ట్రోక్‌కు కూడా దారితీస్తుంది. అందుకే అధిక రక్తపోటు ఉన్నవారు దీన్ని నిర్వహించడానికి వైద్యుడిని సంప్రదించాలి. అదే సమయంలో మీరు తినే ఆహారాలలో చిన్న మార్పులు చేయడం ద్వారా ఈ పరిస్థితిని బాగా నిర్వహించవచ్చు.పండ్లు మరియు కూరగాయలు అధిక రక్తపోటు సమస్యను నిర్వహించడానికి ఆహారంలో పండ్లు మరియు కూరగాయలు బాగా సహాయపడతాయి. సరైన నిపుణుడిని కలుసుకుని, ఏ ఆహారాలు తినడానికి ఉత్తమం అని అతనితో చర్చించిన తర్వాత మీరు ఆ ఆహారాలు తినాలి. ఉదాహరణకు, గుండెకు మంచి ఆహారాలలో టమోటాలు ఒకటి. యుఎస్‌డిఎ డేటా ప్రకారం, ఒక 100–గ్రాముల టమోటాలో 237 మి.గ్రా పొటాషియం ఉంది, ఇది సోడియం యొక్క చెడు ప్రభావాలను ఎదుర్కోవటానికి సహాయపడుతుంది.సోడియం తగ్గించడం చాలా అవసరంఅధిక రక్తపోటు ఉన్నవారు వారి సోడియం తీసుకోవడం తగ్గించమని సలహా ఇస్తారు, ఎందుకంటే టమోటాల మూత్రవిసర్జన లక్షణాలు శరీరానికి మూత్రం ద్వారా అధిక సోడియం విసర్జించడానికి అనుమతిస్తాయి. టొమాటో వంటగదిలో ఉపయోగించే ఒక సాధారణ కూరగాయ. మనం ఉడికించే ప్రతి వంటకంలోనూ ఇది ప్రధాన పదార్థంగా ఉపయోగించబడుతుంది.టమోటా రసం ఉత్తమం అయితే, మీరు టమోటా యొక్క పూర్తి రుచిని పొందాలనుకుంటే, దానిని తినడానికి ఉత్తమ మార్గం టమోటాను రసం రూపంలో తాగడం. టమోటా ఏ విధంగానూ ఉడికించనందున, దాని పోషక విలువలు అలాగే ఉంచబడతాయి మరియు శరీరానికి పూర్తి పోషకాలు లభిస్తాయి.క్యారెట్లు టమోటాల పక్కన, క్యారెట్లు అధిక రక్తపోటును నిర్వహించడానికి సహాయపడే ఆహార పదార్థం. మనలో చాలా మంది ఇది కళ్ళు మరియు చర్మానికి మాత్రమే మంచిదని భావించేవారు. కానీ క్యారెట్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, విటమిన్ సి మరియు విటమిన్ కె 1 రక్తపోటును నిర్వహించడానికి బాగా సహాయపడతాయి. ఈ క్యారెట్‌ను రసం రూపంలో తినేటప్పుడు, దాని పూర్తి పోషకాలు శరీరానికి లభిస్తాయి.అధిక రక్తపోటు సమస్యను నియంత్రించడంలో సహాయపడటానికి క్యారెట్లు మరియు టమోటాలు రెండింటినీ ఎలా రసం చేయాలో ఇప్పుడు చూద్దాం.రసం తయారీకి కావలసినవి:రసం తయారీకి కావలసినవి:టమోటా – 1 (చిన్న ముక్కలుగా తరిగినవి) క్యారెట్లు – 1 (చిన్న ముక్కలుగా తరిగినవి) పుదీనా ఆకులు – 6–7 అల్లం – 1/2 స్పూన్ (పొడి ముక్కలుగా తరిగి) నిమ్మ – సగం (రసం తీసుకోండి)తయారీ చేయు విధానం: మొదట టొమాటో, క్యారెట్, అల్లం, పుదీనా ఆకులను బ్లెండర్‌లో వేసి బాగా రుబ్బుకోవాలి.

తరువాత దాన్ని టంబ్లర్‌లో పోసి, సగం నిమ్మకాయ రసం పోసి మిక్స్ చేసి త్రాగాలి.ఈ రసం అల్పాహారం సమయంలో లేదా స్నాక్స్ సమయంలో తాగవచ్చు.గమనికటొమాటో క్యారెట్ జ్యూస్ అధిక రక్తపోటు సమస్యను నిర్వహించడానికి సహాయపడుతుంది.



## వెన్నెల తింగరి ఏజెంట్ రాక కన్ఫర్మ్

కమెడియన్స్ హీరోగా సినిమాలు చేయడం కొత్తేం కాదు. టాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లో ఎంతో మంది కమెడియన్స్ హీరోలుగా ప్రమోషన్ పొందారు. కొందరు కమెడియన్స్ హీరోలుగా సెటిల్ అవ్వగా కొందరు మాత్రం హీరోగా సక్సెస్ లు దక్కక పోవడంతో మళ్లీ కామెడీ చేస్తూ నవ్విస్తున్నారు. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో టాప్ కమెడియన్ గా దూసుకు పోతున్న వెన్నెల కిషోర్ హీరోగా సినిమా చేస్తున్నాడు.



కొన్ని నెలల క్రితం 'చారి 111' సినిమాను ప్రకటించారు. తాను కన్ఫ్యూజ్ అవుతూ ఇతరులను కన్ఫ్యూజ్ చేస్తూ తింగరి వేశాలు వేసే ఏజెంట్ కథతో ఈ సినిమాను రూపొందించారు.యాత్ర 2 వీటి ఇంపాక్ట్ ఎక్కువే..! ఈ సినిమాలో వెన్నెల కిషోర్ లుక్ మరియు పాత్ర నవ్వు తెప్పించే విధంగా ఉంటాయి అంటూ ఇప్పటికే విడుదల అయిన వీడియో తో తేలిపోయింది. వెన్నెల కిషోర్ కామెడీని ఇష్టపడే చాలా మంది ఈ సినిమా విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం అంటూ సోషల్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. సైలెంట్ గా షూటింగ్ జరిపిన చారి 111 సినిమాను మార్చి 1న విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. చాలా స్పీడ్ గా షూటింగ్ జరిపిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారు. త్వరలో ఫస్ట్ కాపీ రెడీ అవ్వనుంది. ప్రమోషన్ కార్యక్రమాలు కూడా షురూ చేసే అవకాశాలు ఉన్నాయి. ఒశ్రీబనీ ఖీవజీట – చిరంజీవితో వివాదం యండమూరి వివరణ! ఒక వైపు స్టార్ హీరోల సినిమాల్లో కమెడియన్ గా నటిస్తూ చాలా బిజీగా ఉన్న వెన్నెల కిషోర్ ఇలా హీరోగా సినిమాను చేసేందుకు ఓకే చెప్పడంను బట్టి చూస్తూ ఉంటే కచ్చితంగా ఆ కథలో కంటెంట్ ఉండి ఉంటుంది... ప్రేక్షకులను మరింతగా నవ్వించగలను అనే నమ్మకం వెన్నెల కిషోర్ కి ఉండి ఉంటుంది

## అందానికే మరో అందం....





## టీ20 క్రికెట్ ఇక ఊపిరిపీల్చుకో.! డివిలియర్స్, కోహ్లీ కంటే ఈ విధ్వంసకర ప్లేయరే తోపు.. ఎవరంటే?

ట్రెండ్‌కు తగ్గట్టుగా క్రికెట్ కొత్తపుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు టెస్ట్, వన్డే మాత్రమే రాజ్యమేలాయి.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్ వచ్చేసింది. ఈ ట్వీంటీ 20 క్రికెట్ వచ్చిన దగ్గర నుంచి ఫ్రాంచైజీ లీగ్, 100 లీగ్‌లు ఎక్కువైపోయాయి.ఇక ఫార్మాట్లకు తగ్గట్టుగా హీరోలు పుట్టుకురావడం సర్వసాధారణం. క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్.. ఇలా అన్ని ఫార్మాట్లలోనూ విధ్వంసకర ప్లేయర్స్‌గా పేరుతెచ్చుకున్న వీరిని.. అధిగమించడానికి వచ్చేశాడు మరో హీరో.. టీ20 క్రికెట్ ఇక ఊపిరిపీల్చుకో..! ఈ ప్లేయర్ కచ్చితంగా డివిలియర్స్, కోహ్లీ కంటే వీరతోపు. మరి అతడెవరో చూసేద్దాం..మనం మాట్లాడుకునే ఆటగాడు మరెవరో కాదండీ.! దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మెన్ హెన్రిచ్ క్లాసెన్. రెడ్ బాల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇచ్చి.. ప్రస్తుతం వైట్ బాల్ క్రికెట్‌పై దృష్టి సారించిన ఈ రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్.. స్వదేశంలో జరుగుతోన్న ాం20 లీగ్‌లో దుమ్ములేపుతున్నాడు. పిచ్ ఏదైనా సరే.. ముందున్న ప్రత్యర్ధి ఎవరైనా సరే.. ఊచకోత మనోడికి వచ్చింది. తాజాగా జోబర్గ్ సూపర్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫైయర్ 2లో క్లాసెన్ విధ్వంసం సృష్టించాడు. ఐదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు.. కేవలం 30 బంతుల్లోనే 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 74 పరుగులు చేశాడు. అతడి దెబ్బకు డర్బన్ సూపర్ జెయింట్స్ స్కోర్ ఒక్కసారిగా 200 మార్క్ దాటేసింది. క్లాసెన్ బరిలోకి వచ్చినప్పుడు.. జట్టు భారీ స్కోర్ సాధిస్తుందని అనుకోలేదు.ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు క్లాసెన్. ఇక క్లాసెన్‌తో పాటు ముల్డర్ కూడా 23 బంతుల్లో 3 సిక్సర్లు, 3 ఫోర్లతో అర్ధ సెంచరీ సాధించాడు. మరోవైపు భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జోబర్గ్ సూపర్ కింగ్స్.. డర్బన్ బౌలర్లు డాలా(4/38), నవీన్(2/27), ప్రిటోరియస్(2/17) దెబ్బకు 142 పరుగులకే ఆలౌట్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ టోర్నమెంట్‌లో క్లాసెన్.. 12 మ్యాచ్‌ల్లో 25 ఫోర్లు, 37 సిక్సర్లతో 447 పరుగులు చేశాడు. ఇందులో 4 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కాగా, క్లాసెన్.. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోన్న సంగతి తెలిసిందే.



## వార్నర్ 'ట్రిపుల్ 'సెంచరీ'

ఆస్ట్రేలియా వెటరన్ ఆటగాడు డేవిడ్ వార్నర్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో 100కు పైగా మ్యాచ్‌లు ఆడిన మూడో ఆటగాడిగా, తొలి ఆస్ట్రేలియా ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు.మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా హోబర్ట్ వేదికగా వెస్టిండీస్‌తో ఇవాళ (ఫిబ్రవరి 9) జరుగుతున్న తొలి మ్యాచ్ వార్నర్ టీ20 కెరీర్‌లో 100వది. ఇటీవలే వన్డే, టెస్ట్ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన 37 ఏళ్ల వార్నర్ ఇప్పటివరకు 112 టెస్ట్‌లు, 161 వన్డేలు, 100 టీ20లు ఆడాడు.వార్నర్‌కు ముందు ఈ ఘనత న్యూజిలాండ్ మాజీ ఆటగాడు రాస్ టేలర్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి మాత్రమే సాధించారు. రాస్ టేలర్ 112 టెస్ట్‌లు, 236 వన్డేలు, 102 టీ20లు ఆడగా.. కోహ్లి 113 టెస్ట్‌లు, 292 వన్డేలు, 117 టీ20లు ఆడాడు.ఇదిలా ఉంటే, వార్నర్ తన 100వ టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగి ఆసీస్ భారీ స్కోర్ సాధించేందకు గట్టి పునాది వేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వార్నర్.. మొత్తంగా 36 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, సిక్సర్ సాయంతో 70 పరుగులు చేసి అల్జరీ జోసఫ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.వార్నర్ ఔటయ్యాక ఆసీస్ వరసగా వికెట్లు కోల్పోవడంతో స్కోర్ వేగం మందగించింది. 17 ఓవర్ల తర్వత ఆ జట్టు స్కోర్ 173/5గా ఉంది. వార్నర్, జోష్ ఇంగ్లిస్ (39), మిచెల్ మార్ష్ (16), మ్యాక్స్‌వెల్ 10), స్టోయినిస్ (9) ఔట్ కాగా.. టిమ్ డేవిడ్ (18), మాథ్యూ వేడ్ (6) క్రీజ్‌లో ఉన్నారు. విండీస్ బౌలర్లల్లో అల్జరీ జోసఫ్ 2, జేసన్ హోల్డర్, ఆండ్రీ రసెల్, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ పడగొట్టారు.ఇదిలా ఉంటే, 2 టెస్ట్‌లు, 3 వన్డేలు, 3 టీ20ల సిరీస్‌ల కోసం వెస్టిండీస్ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.